ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

గురువారం 27 ఫిబ్రవరి 2025

హరహర

మహాదేవ

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

శివపార్వతుల కల్యాణోత్సవం



లేపాక్షిలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు, (ఇన్‌సెట్‌లో)విద్యుత్ దీపాలంకరణలో లేపాక్షి ఆలయం



లేపాక్షిలో స్వామివారికి పంచామృతాభిషేకం



పుట్టపర్తి శివాలయంలో ప్రత్యేక అలంకరణలో పరమశివుడు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి



హేమావతి సిద్దేశ్వరస్వామికి అలంకరణ



పెనుకొండ భోగసముద్రం చెరువు ఒడ్డున ఉన్న ధ్యానముద్ర శివుడి విగ్రహం వద్ద భక్తుల సందడి



పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో బాబా మహాసమాధికి అలంకరణ



శివుడి విగ్రహాన్ని తీసుకొస్తున్న భక్తులు

పుట్టపర్తి/పుట్టపర్తి రూరల్/లేపాక్షి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శివాలయాలన్నీ ఓం నమః శివాయ శివపంచాక్షరీ మంత్రంతో మార్మోగాయి. బుధవారం ఉదయాన్నే తాడిమర్రి కాటకోటేశ్వరస్వామి, బత్తలపల్లి సంగమేశ్వరస్వామి, సీకేపల్లి కోనకణ్వాశ్రమం, లేపాక్షిలోని వీరభద్రాలయం, హిందూపురం బసవన్నపల్లి ఐముక్తేశ్వరాలయం, పెనుకొండ శ్రీశైలాసం, పుట్టపర్తిలోని శివాలయం, హనుమాన్ ఆలయంలోని పురాతన శివాలయాల్లో స్వామికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు చేశారు. ప్రశాంతినిలయంలోని సాయికుల్వంతు మందిరంలో ప్రత్యేకంగా భజన, శివనామంతో మార్మోగింది. విద్యార్థులు ప్రత్యేకంగా తయారు చేసిన గరలకంఠుడి ప్రతిమను మహాసమాధి సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. భక్తిపాటలతో రాత్రంతా జాగరణ చేశారు. లేపాక్షి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అపురూపమైన ఈ ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వేదపండితులు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడికి వేద పండితులు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 1 గంటకు బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభిస్తామని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. లేపాక్షి ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాల అలంకరణతో విరాజిల్లుతోంది.

రేషన్ పంపిణీలో నొక్కుడు..!

స్టాక్ పాయింట్ నుంచి డీలర్ల వరకూ..

తూకాల్లో మోసం.. నష్టపోతున్న కార్డుదారులు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

పేదోడికి పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో ఎవరికి వారు పందుకొక్కుల్లా మెక్కేస్తున్నారు. స్టాక్ పాయింట్‌లోనే అసలు కథ మొదలవుతోంది. అక్కడి సిబ్బంది సంచులకు రంధ్రాలు పెట్టి నొక్కేస్తుండగా.. కార్డుదారులకు సరఫరా చేసే సమయంలో డీలర్లు తూకాల్లో గోనె సంచులు, డబ్బాలు పెట్టి దోపిడీ చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా.. రెవెన్యూ అధికారులు మాత్రం మామూళ్లతో నోళ్లు మూసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వేయింగ్ స్కేల్‌పై 870 గ్రాములు తూగిన గోనెసంచె (ఫైల్)



గోనె సంచెతోపాటు రేషన్ బియ్యం వేస్తున్న డీలర్ (ఫైల్)

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో స్టోర్ డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పది కిలోలకు అర కిలో, 20 కిలోలకు కిలో చొప్పున ప్రతి కార్డుదారుడికి కొందరు డీలర్లు తూకాల్లో నొక్కేస్తున్నారు. దీంతో ప్రతి కార్డుదారుడు నష్టపోతున్నాడు. కార్డుదారులు ప్రశ్నిస్తే ఇష్టమొచ్చినచోట చెప్పుకోమని డీలర్లు బెదిరిస్తున్నారు. అధికారులు తనిఖీచేసే సమయంలో మాత్రం తూకాలు సక్రమంగా వేస్తారు. రేషన్‌కార్డు తొలగించేలా ఇబ్బంది పెడతారేమో నని మరికొందరు చూసీచూడనట్లు వెళ్తున్నారు. అసలు సమస్య స్టాక్ పాయింట్ నుంచే మొదలవుతోందని డీలర్లు అంటున్నారు. పెనుకొండ డివిజన్ పరిధిలో పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాల స్టోర్ డీలర్లకు ఇక్కడి నుంచే స్టాక్ సరఫరా చేస్తారు. పెనుకొండ మండలంలోని 29 రేషన్ షాపులకుగాను 12,957 కార్డులు ఉన్నాయి. వీరికి 141 టన్నుల 914 కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు. సోమందేపల్లి మండలంలోని 10,941 కార్డులకు 103 టన్నుల 741 కిలోలు, రొద్దం మండలంలోని 14,820 కార్డులకు 124 టన్నుల 885 కిలోల బియ్యాన్ని ప్రతినెలా సరఫరా చేస్తారు. మొత్తం మీద 370 టన్నుల 540 కిలోల బియ్యాన్ని ఈ మూడు మండలాలకు పెనుకొండ నుంచి సరఫరా చేస్తారు. వీరితోపాటు మూడు మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్లకు నూనె 364 కిలోలు, బియ్యం 3 టన్నుల 900 కిలోలు, బేడలు 2 టన్నుల 215 కిలోలు, అరలీటర్ పామాయిల్ 1445 ప్యాకెట్లు, 3 కిలోల బియ్యం ప్యాకెట్లు 1445 సరఫరా చేస్తారు. తమకు తక్కువ తూకాలు వస్తాయి కాబట్టి కోత పెడుతున్నామని కొందరు డీలర్లు అంటున్నారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

కార్డుదారులకు తక్కువ తూకాలు వేస్తున్నట్లు సమాచారం తెలిసినా రెవెన్యూ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తూకాలు తక్కువ వేస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పలుమార్లు హెచ్చరించినా డీలర్లు మారడం లేదు. బియ్యం సరఫరా చేసే సమయంలో వేయింగ్ మిషన్లపై గోనిసంచె, డబ్బా వేస్తారు. ఇంత తంతు తెలిసినా రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు.

తక్కువ తూకాలు వేస్తే చర్యలు

ప్రతి కార్డుదారుడికి వారికి కేటాయించిన మేరకు బియ్యం, ఇతర సరుకులు వేయాలి. తూకాలు వేసే సమయంలో డబ్బా, గోనిసంచె లాంటివి వేయకూడదు. తక్కువ తూకాలు వేసినట్లు తెలిస్తే డీలర్‌షిప్‌ను రద్దుచేస్తాం. తూకాలు తక్కువ వేస్తుంటే స్థానిక తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వండి.

-ప్రభావతి, సీఎస్‌డీటీ, పెనుకొండ



పెనుకొండ స్టాక్‌పాయింట్



సరఫరాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం

భయపడ్డట్లుగానే.. గొడవ

- గుర్రాలు తెచ్చేందుకు నిరాకరించిన గ్రామస్థులు
- బొలెరో వాహనంపై దాడి.. అద్దాలు ధ్వంసం

పోలీసు భద్రత నడుమ కాటకోటేశ్వర ఉత్సవాలు



గ్రామస్థులకు సర్దిచెబుతున్న పోలీసులు



కాటకోటేశ్వరుడు

తాడిమర్రి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాటకోటేశ్వర ఉత్సవాల్లో భయపడినట్లుగానే బుధవారం గొడవ జరిగింది. ఓ వర్గం వారు ఆందోళన చేయగా పోలీసులు సంయమనంతో సద్దుమణిగించారు. బందోబస్తు నడుమ వేడుకలను నిర్వహించారు. సాధారణంగా చెక్కగుర్రాలు, ఆభరణాలు చిల్లవారిపల్లి నుంచి కాటకోటేశ్వర క్షేత్రం వరకు ఊరేగింపుగా రావాలి. ఆలయంలో అలంకరణ చేసిన అనంతరం పూజా కార్యక్రమాలు మొదలవుతాయి. చిల్లవారిపల్లి నుంచి గుర్రాలు, అభరణాలు రాకుండా గ్రామస్థులు అడ్డుకున్నారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దేవదాయ శాఖ అధికారుల ద్వారా గుర్రాలు తీసుకువస్తుండగా గ్రామస్థులు అడ్డగించి బొలెరో వాహనంపై దాడి చేశారు. అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో గుర్రాలను చిల్లవారిపల్లి ఆలయంలోకి చేర్చారు. గ్రామం నుంచి గుర్రాలను తీసుకెళ్తే ఆత్మహత్య చేసుకుంటామని మంజునాథరెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకటశివ, సిరియాల కిష్ట పెట్రోలు పోసుకున్నారు. మిగిలిన గ్రామస్థులు, పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. సంప్రదాయం ప్రకారం ఉత్సవాలు నిర్వహించుకోవాలంటూ పోలీసులు తెలిపినా ఒక వర్గం వారు వినలేదు. రాత్రి 9గంటల సమయంలో ఎస్పీ రత్న చిల్లవారిపల్లి సచివాలయానికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. గుర్రాలు ఆలయ ప్రాంగణానికి వస్తే గురువారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం చేశాక ఉత్సవాలు ముగుస్తాయి.

ఈ-శ్రమ్‌తో భవితకు భరోసా

అసంఘటిత కార్మికులకు వరం

కేంద్ర ప్రభుత్వ ఉచిత ప్రమాద బీమా

పోర్టల్‌లో వివరాల నమోదుకు అవకాశం

నేరుగా బ్యాంకుఖాతాలో నగదు జమ



ఉపాధి పనుల్లో కూలీలు

ధర్మవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రెక్కాడితే గాని డొక్కాడని పేదల కుటుంబంలో నలుగురు పనిచేస్తేనే బతుకుబండి ముందుకు వెళ్తుంది. ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణిస్తే వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రీమియం చెల్లించి, బీమా పొందలేని పరిస్థితుల నుంచి అసంఘటిత కార్మికులను ఆదుకోవాలన్న లక్ష్యంతో, సామాజిక భద్రతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చింది. కష్టకాలంలో అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ సురక్ష బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. శాశ్వత పోర్టల్‌లో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి 12 అంకెలు ఉన్న ప్రత్యేక గుర్తింపు కార్డును అందజేస్తారు. ఈ పథకం చాలా కాలంగా అమలులో ఉన్నా కార్మికులకు కనీస అవగాహన లేక నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్‌పై విస్తృత అవగాహన కల్పిస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులకు రిజిస్ట్రేషన్లపై లక్ష్యాన్ని విధించి మరీ ముందుకు సాగుతోంది. సత్యసాయి జిల్లాలో అసంఘటిత కార్మికులు రెండు లక్షల మంది ఉన్నారు. స్థానిక సచివాలయాలతో పాటు కార్మికులు సొంతంగా ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా పూర్తి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వారికి యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబరుతో కార్డు వస్తుంది. ఈ-శ్రమ్ కార్డులు పొందిన వారు ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలో కస్టమర్ సర్వీస్ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ వివరాలు ఆయా ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ పీడీ కార్యాలయానికి వెళ్తాయి. వీరు మిగిలిన వివరాలన్నింటిని సేకరించి విచారణ అనంతరం కలెక్టర్‌కు పంపిస్తారు. అనంతరం ఈ-శ్రమ్ కార్డు పొందిన కార్మికుడు మృతి చెందితే రూ.2 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే ఘటన తీవ్రతను బట్టి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు అందజేస్తారు.

ఈ-శ్రమ్‌కు అర్హులు ఎవరంటే..

ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్‌తో బీమా పొందడానికి ఎవరెవరు అర్హులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, ఉపాధి సిబ్బంది, కల్లుగీత కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, డ్రైవర్లు, టైలర్లు, కుమ్మరి, కమ్మరి, చేనేత, కుట్లు, అల్లికలు, వీధి వ్యాపారాలు, బ్యూటీ పార్లర్, సెల్యూన్ షాప్స్, రజకులు, స్వర్ణకారులు, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కూలీలు ఇలా అనేక మంది ఈ పథకం కిందకు తీసుకొచ్చారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారంతా ఈ-శ్రమ్ కార్డులను పొందే అవకాశం కల్పించారు. పన్ను పరిధిలోకి వచ్చే వారు అనర్హులు. ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్(ఈపీఎఫ్), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్(ఈఎస్ఐ) సదుపాయం ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

నమోదుకు కావాల్సిన పత్రాలు

కార్మికుడు ఈకేవైసీ పూర్తి చేసుకున్న ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్ అందుబాటులో ఉండాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీ మొబైల్, ఫింగర్ ప్రింట్, ఐరిస్, బ్యాంకుఖాతా, ఐఎఫ్ఎస్‌సీకోడ్ వివరాలతో కస్టమర్ సర్వీస్ సెంటర్ల ద్వారా నమోదు చేసుకోవచ్చు.

కార్మికులకు మంచి అవకాశం



వివిధ పనులకు వెళ్లే కార్మికులకు ఇలాంటి బీమా సౌకర్యం కల్పించడం మంచి నిర్ణయం. సాధారణంగా కార్మికులు నిత్యం ప్రమాదపుటంచునే పనిచేస్తుంటారు. అలాంటి వారికి ఈ పథకం నిజంగానే ఒకవరం. అందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

- అనిల్, బేల్దారి, ముదిగుబ్బ

కార్మికుల్లో అవగాహన కరువు



కార్మికుల కోసం అమల్లోకి తీసుకువచ్చిన ఈ పథకం ఉద్దేశం చాలా బాగుంది. కానీ చాలా మందిలో ఈ పథకంపై ఎలాంటి అవగాహన లేదు. కార్మికులకు ఇలాంటి పథకాలపై నిత్యం అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎలాంటి ఖర్చు లేకుండా సులువుగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఈ పథకాన్ని రూపొందించారు.

- సోమశేఖర్, చేనేత కార్మికుడు

అవగాహన కల్పించాలి



పేద వర్గాలైన అసంఘటిత కార్మికులను ఆదుకునే పథకం మంచిదే. దీనిపై కార్మికులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మరింత విస్తృత అవగాహన కల్పించాలి.

- మధు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

కార్మికులకు భరోసా

అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఈ-శ్రమ్ కార్డు భరోసానిస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఉండవు. వారికి ఆర్థిక, సామాజిక భద్రత అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పథకాన్ని తీసుకు వచ్చింది. ఇప్పటి వరకు 52వేల మంది అసంఘటిత కార్మికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గతంలో ఇద్దరు ఈ బీమాతో లబ్ధిపొందారు.

- సూర్యనారాయణ, లేబర్ ఆఫీసర్, సత్యసాయి జిల్లా

రేపు రాయదుర్గంలో డీఐఈపీసీ సమావేశం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని ఈనెల 28న రాయదుర్గం పట్టణం టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతినెలా నాలుగో శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ నెల నాలుగో శుక్రవారం 28న రాయదుర్గంలోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారన్నారు. కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కుడి కాలువకు నీరు బంద్



కుడి కాలువలో ఆగిపోయిన నీటి ప్రవాహం

కూడేరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కుడికాలువకు వస్తున్న నీటిని అధికారులు బుధవారం నిలిపివేశారు. మూడు రోజులుగా కాలువలో నీటి ప్రవాహం తగ్గించారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో 3.099 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలోఉన్న నీటి ప్రాజెక్టులో తాగునీటి అవసరాల కోసం నీటిని నిల్వ చేసినట్లు ఆమె వెల్లడించారు.

అప్పుల ఉరికి యువరైతు బలి

అనంతపురంలో గురుగుంట్ల రైతు ఆత్మహత్య



యోగేంద్ర (ఫైల్)

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన రైతు యోగేంద్ర(28) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఓబులేసు, ఆదిలక్ష్మమ్మ దంపతులకు యోగేంద్ర ఏకైక కుమారుడు. వారికున్న రెండెకరాల పొలంలో వరి, వేరుశనగ తదితర పంటలను సాగుచేశారు. కొంత భూమిని కౌలుకు కూడా తీసుకుని వ్యవసాయం చేసేవాడు. గత ఐదేళ్లుగా సరైన దిగుబడి రాకపోవడం, పంట సాగుకు చేసిన అప్పుల మొత్తాలు పెరిగి పోయాయి. ఇలా రూ.20లక్షల వరకు అప్పులభారం పెరిగిపోయింది. యోగేంద్ర తండ్రి ఓబులేసు మూడేళ్ల కిందట మరణించారు. ఈ నేపథ్యంలో యోగేంద్ర నగరానికి వచ్చి బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గుత్తిరోడ్డులోని మసీదు కొట్టాలవద్ద రామిరెడ్డి కాలనీలో గుడిసెలో నివాసముంటూ నగరంలో బేల్దారు పనులకు వెళ్లేవాడు. వ్యవసాయానికి చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించే మార్గం కనిపించకపోవడంతో బుధవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. మృతుడికి తల్లి ఆదిలక్ష్మమ్మ, భార్య రామాంజినమ్మ, నాలుగేళ్ల కూతురు హిమజ ఉన్నారు. మమ్మల్ని దిక్కులేనివారిగా వదిలేసి వెళ్లిపోయావా అని తల్లి, భార్య కన్నీరుమున్నీరుగా విలపించం అందరినీ కలచివేసింది.

వన వైభవం..!



నర్సరీలో పంపిణీకి సిద్ధమవుతున్న మొక్కలు

- ☆ కూటమి పాలనలో అటవీ శాఖలో అభివృద్ధి పరుగులు
- ☆ జిల్లాలో పచ్చదనం పెంపునకు చర్యలు
- ☆ 15 నర్సరీల్లో 30 లక్షల మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక
- ☆ పండ్ల మొక్కలకూ ప్రాధాన్యం
- ☆ రహదారుల పక్కన బ్యూటిఫికేషన్‌కు చర్యలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పచ్చదనం పెంపునకు అటవీ శాఖాధికారులు చర్యలు ముమ్మరం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో నిర్వీర్యమైన నర్సరీలు కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వేగంగా కోలుకుంటున్నాయి. అటవీ శాఖ బాధ్యతలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల్లో ఉండటం బాగా కలిసి వస్తోంది. నిధులకు ఇబ్బంది లేదన్న ఆలోచనతో శాఖ సిబ్బంది కూడా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న 15 నర్సరీల్లో 30 లక్షల మొక్కల పెంపు శ్రీకారం చుడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతంలో అవసరాలకు అనుగుణంగా నీడను ఇచ్చే మొక్కలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ వాటినే నర్సరీల్లో అందుబాటులో ఉంచేవారు. ఈ ఏడాది పండ్లమొక్కలు సైతం అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. రహదారుల పక్కన మరింత బ్యూటిఫికేషన్‌కు చర్యలు చేపడుతున్నారు. గతంలో నాటిన మొక్కల పరిస్థితి ఏంటి? ప్రస్తుతం నూతనంగా ఎక్కడెక్కడ రోడ్లు వేశారు, అక్కడ ఎన్ని మొక్కలు అవసరం అవుతాయి? ఎలాంటివి నాటితే రోడ్లకు ఇరువైపులా మంచి ఆహ్లాదకరంగా ఉంటుందన్న వివరాలు సేకరిస్తున్నారు.

వైసీపీ పాలనలో నిర్వీర్యం

గత వైసీపీ ప్రభుత్వం అటవీ శాఖకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసింది. దీంతో నర్సరీల్లో మొక్కలు కనిపించకుండా పోయాయి. పైసా నిధులు కేటాయించిన పాపాన పోలేదు. వెరసి.. వర్షాలు సమృద్ధిగా కురిసినా.. నర్సరీల్లో మొక్కలు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలకే పరిమితమయ్యారు. మిగిలిన ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు మంగళం పలికారు. సిబ్బంది సైతం కార్యాలయానికి వచ్చామా? వెళ్లామా.. అన్న చందంగా వ్యవహరించారు.

30 లక్షల మొక్కల పెంపునకు ఏర్పాట్లు

జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు పెంచడానికి నర్సరీల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో బాగంగా 15 నర్సరీల్లో 30 లక్షల మొక్కలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. వీటిలో 15 లక్షలు మాత్రమే ఈ ఏడాదికి వినియోగించనున్నారు. మరో 15 లక్షలు అవసరాలకు అనుగుణంగా ఎత్తైన మొక్కలు వచ్చే ఏడాదికి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయి. అనంతపురం, ఉరవకొండ, శింగనమల, బుక్కరాయసముద్రం, పుట్లూరు, తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, రాయదుర్గం, కుందుర్పి, గుమ్మఘట్ట తదితర ప్రాంతాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి శ్రీకారం చుట్టారు.



నర్సరీల్లో మొక్కల పెంపునకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

15 నర్సరీల్లో మొక్కలు సిద్ధం



జిల్లాలో అవసరాలకు అనుగుణంగా 15 నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాం. వీటిలో పండ్ల మొక్కలు సైతం ఉన్నాయి. వాటిని గ్రామాల్లో ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో నాటించి, సంరక్షణను స్థానికులకే అప్పగిస్తాం.

- చంద్రశేఖర్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ

పండ్ల మొక్కలకు ప్రాధాన్యం

నీడనిచ్చే మొక్కలే కాకుండా పండ్లను ఇచ్చే మొక్కలను సైతం నర్సరీల్లో అందుబాటులో ఉంచేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జామ, ఉసిరి, దానిమ్మ, శీతాఫలం, నేరేడు తదితర 40 రకాల పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచనున్నట్లు యంత్రాంగం చెబుతోంది.

అవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ

హైవేలకు ఇరువైపులా మొక్కలు నాటనున్నారు. అనంతపురం నుంచి గుత్తి మీదుగా హైదరాబాద్ రోడ్డుకు గతంలో నాటిన మొక్కల పరిస్థితి ఏంటి? ప్రస్తుతం ఎక్కడెక్కడ మొక్కలు నాటాల్సి ఉంది, ఎన్ని, ఎలాంటివి అన్న అంచనాలు తయారు చేస్తున్నారు. పెనుకొండ వైపు బెంగళూరు రోడ్డుకు సైతం ఇదే తరహాలో చర్యలు చేపట్టనున్నారు. తాడిపత్రి రోడ్డును ఇటీవలే విస్తరించారు. ఆ రోడ్డు పక్కన ఎక్కడెక్కడ మొక్కలు అవసరం అన్నది అంచనాలు తయారు చేసి, అనుమతుల మంజూరుకు శ్రీకారం చుట్టారు. కొత్తగా నిర్మాణం చేపట్టనున్న రోడ్లకిరువైపులా మొక్కలు నాటేలా వివరాలు సేకరిస్తున్నారు.

బైక్ చోరీల కేసులో ఇద్దరి అరెస్ట్

పట్టుకున్న పోలీసులకు రివార్డులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, నిందితులతో పోలీసులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బైక్‌ల చోరీలకు పాల్పడే ఇద్దరు దొంగలను అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పదిరోజుల కిందట బళ్లారి బైపాస్‌లో హోండా షైన్, మారుతీనగర్ ఫస్ట్ క్రాస్‌లో హీరో స్పెండర్ బైక్‌లు చోరీ అయ్యాయి. నగరంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన పాత నేరస్తుడైన చాకలి మధు, పెనుకొండకు చెందిన నరసింహులును సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుళ్లు ప్రణీష్, మహేష్‌లను జిల్లా ఎస్పీ అభినందించి ప్రోత్సాహక రివార్డులు అందజేశారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,560 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8,400, సరాసరి రూ. 16,220తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 118 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 450 టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

నార్పల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దిగుమర్రి రోడ్డులో బుధవారం ఓ ఇంట్లో పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడ్డారు. నార్పలకు చెందిన చర్చి ఫాదర్ డెవిడ్ ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో కలిసి బత్తలపల్లికి వెళ్లాడు. దీన్ని గమనించిన దుండగులు తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలో ఉన్న 4తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన డెవిడ్ తాళాలు పగలగొట్టి ఉండగా చోరీ జరిగిందని భావించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపాడు.

శివయ్య సేవలో ఎంపీలు అంబికా, బీకే



లేపాక్షిలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ అంబికా



పెనుకొండ కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న బీకే

ఎమ్మెల్యే అమిలినేని చొరవతో కార్మికులకు జీతాలు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు రెండు నెలల జీతం లభించింది. ఐదు నెలల జీతాలు రాకపోవడంతో ఈ నెల 18న కళ్యాణదుర్గం బైపాస్ వద్ద నీటి పథకం కార్మికులు సమ్మె చేశారు. దీంతో ఎమ్మెల్యే పంపుహౌస్ వద్దకు వెళ్లి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న కాంట్రాక్టర్లతో మాట్లాడి జీతాలు త్వరగా ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మార్చి 3వ తేదీ జీతాలు రాకపోతే తన సొంత నిధులు ఇస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు వెంటనే సమ్మె విరమింపజేసి విధుల్లో చేరారు. ఈక్రమంలోనే రెండు నెలల జీతాలు అందజేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాల్లో 200 మందికి జీతాలు అందినట్లు కార్మికులు తెలిపారు.

సస్పెండైన అధికారుల స్థానాల్లో ఇన్‌చార్జ్‌లు

- హిందూపురం సీటీఓగా మురళీమనోహర్
- డీసీటీఓలుగా ఒక డీసీటీఓ, ఇద్దరు ఏసీటీఓలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో సస్పెన్షన్‌కు గురైన అధికారుల స్థానాల్లో ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీటీఓ, ముగ్గురు డీసీటీఓలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్‌ను ఇన్‌చార్జ్ సీటీఓగా నియమించారు. ఇన్‌చార్జ్ డీసీటీఓలుగా పుట్టపర్తి డీసీటీఓ సురేష్‌కుమార్‌రెడ్డి, పుట్టపర్తి ఏసీటీఓ అనిల్, హిందూపురం ఏసీటీఓ చంద్రశేఖర్‌లను నియమించారు. గురువారం వారు ఇన్‌చార్జ్ బాధ్యతలను చేపట్టనున్నారు. డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్ బాధ్యతలు తీసుకుంటారా..? లేదా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సెలవులోనైనా వెళ్తా... చార్జ్ తీసుకోను

హిందూపురంలో పన్నుల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టడానికి అధికారులు వెనుకడుగేస్తున్నారు. ఓ అధికారి హిందూపురంలో బాధ్యతలా...వద్దు బాబోయ్ అంటున్నారట. అవసరమైతే సెలవులో వెళ్తా కానీ అక్కడ మాత్రం పనిచేయనని చెప్పారట. ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు కానీ ఆయన చార్జ్ తీసుకుంటారో లేదో చూడాలి.

నీరాశే

- హెచ్చెల్సీ ఆయకట్టుకు నీటి గండం
- పంటలకు మార్చి వరకు నీరు అవసరం
- బోరుబావులను వేధిస్తున్న లోఓల్టేజీ సమస్య



రంగాపురం క్యాంప్ వద్ద నెర్రెలు ఇచ్చిన వరి మాగాణి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి తుంగభద్ర నీరు ఆగిపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. సరిపడా నీరు వస్తాయన్న ఆశతో రైతులు విస్తారంగా పంటలు సాగు చేశారు. కనీసం మార్చి 15 వరకు అయినా నీరు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం అర టీఎంసీ అదనంగా నీరు రావడం వల్ల కొంతవరకు ప్రయోజనం కలిగినా, పంట మొత్తానికి చాలదని రైతులు నిరాశ చెందుతున్నారు. దీనికి తోడు బోరుబావుల ద్వారా పంటలు పండించుకుందామనుకున్నా లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. దీంతో సాగుచేసిన పంటలు వాడుముఖం పడుతున్నాయి. ఇది వరకే హెచ్చెల్సీకి కోటా పూర్తి కావడంతో ఈ నెల 10 నుంచి కాలువకు నీటి విడుదలను బోర్డు అధికారులు నిలిపివేశారు. మరో 20 రోజులు పాటు పుష్కలంగా నీరు వచ్చి ఉంటే పంట దిగుబడులు బాగుండేవని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెచ్చెల్సీకి ఈ సారి 30.354 టీఎంసీల నీరు అందాయి. జిల్లాకు తాగునీటి అవసరాల కోసం 3 టీఎంసీలను కేసీ కెనాల్ కేటాయింపుల నుంచి హెచ్చెల్సీకి మళ్లించారు. దీంతో ఈ ఏడాది జిల్లాకు 33.354 టీఎంసీల నీరు అందింది. ప్రస్తుతం మరో అర టీఎంసీ అదనంగా విడుదల చేస్తున్నారు.

నెర్రెలు చీలిన వరి చేలు

మండలంలోని రంగాపురం క్యాంప్, ఉద్దేహాళ్, గోనేహాళ్, ఉప్పరహాళ్, దేవగిరి, హరేసముద్రం తదితర గ్రామాలలో వరి పంటను సాగు చేశారు. హెచ్చెల్సీకి నీరు ఆగిపోవడంతో పంటకు వ్యవసాయబోర్ల నీరు చాలక వరి చేలు నెర్రెలు వదులుతున్నాయి. నెర్రెలువారిన భూమిని చూసి ఆరుగాలం శ్రమంతా వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి రెండో వారం వరకు నీరు వస్తే రెండు తడులు తడిస్తే వరి పంట కొంత వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. లేకపోతే ధాన్యం తాలుపడి నష్టపోయే పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ లోఓల్టేజ్ కారణంగా మరింత నీటి ఎద్దడి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మరో టీఎంసీ తీసుకుంటేనే...

కేసీ కెనాల్ నుంచి 0.5 టీఎంసీల నీటిని హెచ్చెల్సీకి రెండోసారి విడుదల చేయడంతో రైతులు ఆనందిస్తున్నా, ఈ నీరు పంట పండటానికి చాలదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కేసీకెనాల్ వాటా ఆరు టీఎంసీలు ఉండటంతో ప్రభుత్వ పెద్దలు తుంగభద్ర బోర్డు అధికారులపై ఒత్తిడి తెచ్చి మరో టీఎంసీ తీసుకుంటే పంటలకు జీవం పోసినట్లు ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పుడు వచ్చే నీరు జీబీసీకి వెళ్లాలని ఇక్కడి రైతులు నీటిని వాడుకోకుండా అధికారులు కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా అయితే వచ్చిన అర టీఎంసీలో కూడా ఇక్కడ పంటలకు అందే పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి బోర్డు అధికారులతో మాట్లాడి మరో టీఎంసీని తీసుకురావాలని కోరుతున్నారు.

బోర్లలో నీరు రావడంలేదు



విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులతో పాలు పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న పంటకు నీటి ఎద్దడి ఏర్పడుతోంది. లోఓల్టేజ్ సమస్య కారణంగా మొక్కజొన్న పంట ఎండుతోంది. మరోవైపు తడులు అవసరమైన వేరుశనగ, వరి పంటలను సైతం నీటి సమస్య వేధిస్తోంది. విద్యుత్‌లో వోల్టేజీ సమస్యతో బోరుబావుల నుంచి వచ్చే నీరు కూడా తగ్గిపోయింది.

-సంజప్ప, రైతు, దేవగిరి గ్రామం

రెండు తడులు ఇచ్చింటే బాగుండేది



ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటకు తుంగభద్ర నీరు ఇంక రెండు తడులు ఇచ్చింటే బాగుండేది. తుంగభద్రలో ఉన్న నీటిపై ఆశతో ఈ సారి రైతులు వరి పంటను సాగు చేశారు. ఫిబ్రవరిలోనే నీటిని ఆపేయడంతో పంటపై ఆశలు వదలుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ బోర్లలో కూడా నీరు అంతంత మాత్రమే వస్తున్నాయి. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.

-ఈశ్వర, రైతు, శ్రీధరఘట్ట

పంటలను కాపాడాలి



రబీసీజన్‌లో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న సమయంలో అర టీఎంసీ నీరు రావడం ఆనందంగా ఉంది. అయితే ఈ నీళ్లు పొలాలకు సరిపడవు. మార్చి 15వ తేదీ వరకు నీరు వస్తే బాగుంటుంది. ఇప్పుడు వచ్చే నీరు పొలాలలోకి వస్తాయన్న ఆశ లేదు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

యువకుడిని కాపాడిన పోలీసులు



రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రూరల్ సీఐ శేఖర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు యత్నిస్తున్న ఓ యువకుడిని రూరల్ పోలీసులు కాపాడారు. సీఐ శేఖర్ తెలిపిన మేరకు... కూడే రు మండలం జల్లిపల్లికి చెంది న రామాంజనేయులు ఐటీఐ చదువుకుని జీవనాధారం కోసం టీస్టాల్ నిర్వహిస్తుండేవాడు. ఇటీవల ఇల్లు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో రూ.4.5లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయమై స్నేహితుడైన రాముకు వాట్సాప్ ద్వారా బుధవారం మధ్యాహ్నం సమాచారం పంపాడు. దీంతో ఆందోళన చెందిన రాము తనకు పరిచయమున్న ఆత్మకూరు ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్‌కు సమాచారం పం పాడు. అతను అనంతపురం ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ శీనాకు చేరవేశాడు. వారి నుంచి రూరల్ సీఐ శేఖర్‌కు సమాచారం అందగా...బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు దేవేంద్ర, నాగేంద్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సోములదొడ్డి సమీపంలో ఉన్న రామాంజనేయులు వద్దకు చేరుకున్నారు. అప్పటికే రామాంజనేయులు బైక్ టైర్ ట్యూబ్‌కు తాను ధరించిన చొక్కాను కట్టి చెట్టుకు ఉరివేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు గమనించిన కానిస్టేబుళ్లు అతడిని కాపాడారు. ఐదు నిమిషాలు ఆలస్యమై ఉంటే ఉరి వేసుకుని ఉండేవాడు. కౌన్సెలింగ్ అనంతరం రామాంజనేయులును అతడి బంధువులకు అప్పగించారు.

బ్లాక్‌మెయిల్ చేసిన విద్యార్థిపై కేసు

ఓ విద్యార్థినిని ఫొటోల పేరుతో బ్లాక్ మెయిల్ చేసిన విద్యార్థిపై ఇటుకపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హేమంత్‌కుమార్ తెలిపిన మేరకు... ఎస్కే యూనివర్సిటీలో బీటెక్ చేస్తున్న ఓ విద్యార్థినితో, లైబ్రేరియన్ కోర్సు చదువుతున్న మరో విద్యార్థితో పరిచయమైంది. ఇద్దరూ సన్నిహితంగా మెలిగారు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి ఫొటోలు దిగారు. అయితే ఫొటోల పేరుతో తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని విద్యార్థిపై ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో ఇటుకలపల్లి పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు, వేధింపుల కేసు నమోదు చేశారు.


ధర్మవరం : కొత్తపేటలో కల్యాణోత్సవం

హరహర మహాదేవ.. పరమేశ్వరా..!

కిటకిటలాడిన శైవక్షేత్రాలు


రథోత్సవంలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, హరీశ్, భక్తులు

ధర్మవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలు బుధవారం కిటకిటలాడాయి. స్థానిక కొత్తపేటలోని శివాలయంలో శివపార్వతులకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని తిక్కస్వామినగర్‌లోని శివానగర్ శివాలయంలో నిర్వహించిన రథోత్సవంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ పాల్గొన్నారు.

● నంబులపూలకుంట : మండలంలోని గూటిబయలులో తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతంలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ఆర్డీఓ వీవీ శర్మ దంపతులు, తహసీల్దార్ దేవేందర్ నాయక్ తిమ్మమ్మను దర్శించుకున్నారు. ఎస్సీకుంట, ధనియాని చెరువు, పెడబల్లి, గౌకనపల్లి, గ్రామాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.


అలంకరణలో తిమ్మమ్మ


సంగమేశ్వరస్వామి

● కొత్తచెరువు: స్థానిక సోమేశ్వరస్వామి, సంఘమేశ్వర, నాగులకనుమ వద్ద ఉన్న శివాలయం, మరువ ఆంజనేయస్వామి ఆలయాల్లో శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి ఆలయాల్లో భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

● నల్లమాడ: మండలంలో రాగానిపల్లి, గోపేపల్లి, మసకవంకపల్లి, నల్లమాడ, వంటరికుంట భవనాశిని ఆలయం, తదితర గ్రామాల్లో శివరాత్రిని ఘనంగా జరుపుకున్నారు.


నల్లమాడ శివాలయంలో భక్తులు

● తనకల్లు: మండలంలోని ఈతోడు, మలిరెడ్డిపల్లి, శింగినవాండ్లపల్లి, పడమటవాండ్లపల్లి, బాలసముద్రం, తనకల్లు, సిసదుం గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కనుమలో ఉన్న బైరాజుస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.


బైరాజు స్వామి

● ఓబుళదేవరచెరువు: స్థానిక శివాలయంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు.మండలంలోని అయ్యప్ప ఆలయం ఆవరణంలో శివాలయంలో రామిరెడ్డిపల్లి శివాలయంలో, ఓడీసీ బాబా దర్గాలో శివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు.


ఓడీసీ: శివాలయంలో కల్యాణోత్సవం

● బత్తలపల్లి: స్థానిక లలితా త్రిపుర సుందరిదేవి ఓంకారేశ్వరుడు, సంగమేశ్వరంలోని సంగమేశ్వరుడు, ముస్టురులోని శివాలయం, గంటాపురంలోని అప్పనాయనస్వామి, మాల్యంతంలోని రామాపురంలోని వీరనారాయణ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఓంకారేశ్వరుడు

● బుక్కపట్నం: స్థానిక కోట వీధిలోని శివాలయంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిలింగాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


బుక్కపట్నం: కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె


కదిరి : శివాలయం వద్ద స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

అటకెక్కిన వ్యవసాయం

- సాగు పరికరాలు లేక రైతుల ఇబ్బందులు
- యంత్రాలు పంపిణీ చేయని గత ప్రభుత్వం
- ఐదేళ్లుగా అన్నదాతల ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పొలాలను దుక్కి దున్నడం.. విత్తనాలు వేయడం.. నుంచి పంట ఉత్పత్తులను అమ్ముకునే వరకు నేడు వ్యవసాయ రంగంలో పలు రకాల యంత్ర పరికరాలు తప్పనిసరి అయ్యాయి. కరువు జిల్లాలో వర్షాభావం కారణంగా అనేక మంది వ్యవసాయ కూలీలు వ్యవసాయ రంగాన్ని వీడి.. పొరుగు రాష్ట్రాలకు ఉపాధి కోసం వలస వెళ్లారు. దీంతో ఉన్న రైతులకు వ్యవసాయ కూలీలు దొరక్కపోవడంతో తప్పనిసరిగా యంత్రాలపై ఆధారపడాల్సి వచ్చింది. వారిని ఆదుకునేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం సబ్సిడీతో పలు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా స్ప్రేయర్లు, రెయిన్ గన్‌లు, రోటావేటర్లు, నాగళ్ళు, విత్తనం గొర్రులు, గుంటక, టార్పాలిన్లు రైతులకు రాయితీపై ఇచ్చింది. రైతు రథం పేరుతో వ్యక్తిగతంగా రాయితీపై ట్రాక్టర్లు అందించింది. అంతేకాకుండా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి ఆదుకుంది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించి పరికరాలను నాటి పాలకులు అందుబాటులో ఉంచేవారు. దీంతో నాడు అనేక మంది రైతులు వ్యవసాయ రంగంపై ఆశలు పెంచుకొన్నారు.

● వైసీపీ నిర్లక్ష్యం

వైసీపీ సర్కారు కొలువుదీరిన నాటి నుంచి అధికారం కోల్పోయే వరకు రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. వ్యక్తిగత వ్యవసాయ పరికరాలను అందించిన దాఖలాలే లేవు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ యంత్రాల పంపిణీకి మంగళం పాడింది. అంతేకాకుండా గత టీడీపీ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేసిన పలు పథకాలనూ అటకెక్కించింది. వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. ముదిగుబ్బ మండలంలో వరి, వేరుశనగ, కంది, ఉలవ, మొక్కజొన్న, మిరప, టమోటా వివిధ రకాల పంటలను 17వేల మంది రైతులు 62 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలో 21 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అప్పటిలో ఆర్బీకేలలో ఐదుగురు రైతులను గ్రూపుగా ఎంపిక చేసి, ఒక ట్రాక్టర్ ఇతర పరికరాలను అందిస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. అయితే కొన్ని ఆర్బీకేలలో మాత్రమే తూతూ మంత్రంగా రైతులకు పరికరాలను అందించి.. చేతు లు దులుపుకుంది. అందులో వైసీపీ అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ట్రాక్టర్లు పంపిణీ చేశారు. గ్రూపులకు ఇచ్చిన ట్రాక్టర్లను కొంద రు సొంతానికే వాడేసుకున్నారు. దీంతో అసలైన రైతుకు అన్యాయం జరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పాత పథకాలను పునరుద్ధరిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


పొలాన్ని చదును చేస్తున్న రైతులు



యంత్రాలు అందించాలి

టిల్లరు, గుంటక సేద్యానికి గంటకు దాదాపు వెయ్యి రూపాయల దాకా ఖర్చు అవుతోంది. 8 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. ట్రాక్టరు బాడుగలకే చాలా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతులకు రాయితీపై యంత్రా లు ఇస్తే ఆ భారం తగ్గుతుంది. రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి.

-త్రిలోక్, రైతు, గుంజేపల్లి



నష్టపోయాం

గతంలో టీడీపీ ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ యంత్రాలు అందించేది. రైతుల కోసం అనేక పథకాలనూ అమలు చేసేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ రైతుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. రైతు పథకాలకు నీళ్లు వదిలేసింది. చాలా నష్టపోయాం.

-అమరా నాయుడు, రైతు, కమ్మవారిపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

రైతులు వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేయాలని అడుగుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. రైతులకు వ్యవసాయ యంత్రాలు, ఇతర పరికరాలు రాయితీపై అందించే పథకాలను పునరుద్ధరిస్తే మేలు.

- లక్ష్మీనరసింహులు, వ్యవసాయ అధికారి, ముదిగుబ్బ

మఠంలో పూజలు ప్రారంభం

- గతంలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- స్థానికులే స్వచ్ఛందంగా శుభ్రంచేసిన వైనం
- శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నడిబొడ్డులో ఉన్న పెద్దమఠాన్ని స్థానికులే బాగు చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా అందులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పెద్దమఠం శిథిలావస్థకు చేరుకోవడంతో పూజలు లేక.. నిరుపయోగంగా మారింది. దీంతో ఆ మఠం ఆకతాయిలకు గంజాయి, మద్యం తాగుబోతులకు నిలయంగా మారింది. ఆ యువకులు ఆ మఠంలో గంజాయి, మద్యం సేవించి గొడవకు దిగుతుండటంతో ఆ చుట్టు పక్కల నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. దీంతో స్థానికులే స్పందించి.. ఆ మఠంలో మఠంలో చెత్త, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. సున్నం పూసి.. ముస్తాబు చేశారు. శివరాత్రి సందర్భంగా ఆ మఠాన్ని అలంకరించారు. మఠంలోని శివునికి, నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇకపై ఈ మఠంలోకి ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తామే వారికి తగిన రీతిలో బుద్ధిచెబుతామని హెచ్చరించారు. పోలీసులు కూడా రాత్రి సమయంలో మఠం వద్ద గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.


మఠంలో పూజలు నిర్వహిస్తున్న ప్రజలు


మఠాన్ని శుభ్రం చేసి.. తోరణాలు కడుతున్న దృశ్యం

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర


పల్లకిలో ఊరేగుతున్న పెద్దమ్మతల్లి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత పెద్దమ్మతల్లికి మూడు రోజుల పాటు నిర్వహించే జాతరను బుధవారం ప్రారంభించారు. పెద్దమ్మతల్లి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి పెద్దమ్మ తల్లిని పల్లకిలో ఉంచి పాతూరు పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

గ్రామానికి రహదారి చూపండి


రహదారికి అడ్డంగా ఉంచిన రాళ్లు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రహదారి చూపాలని మండలంలోని ఎగువతుపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. ఈ గ్రామానికి వెళ్లే రహదారిలో చాలా మంది పట్టాలు ఉన్నాయని, రహదారి సమస్య పరిష్కరించిన తరవాతే ఈ మార్గంలో వెళ్లాలని అదే గ్రామానికి చెందిన భూ యజమానికి సోమశేఖర్‌రెడ్డి రోడ్డుకు అడ్డంగా బుధవారం రాళ్ల వేశాడు. దీంతో రాకపోకలు ఆగిపోవడంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

గాండ్లపెంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో మంగళవారం రాత్రి జూదమాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.77,270 స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో కదిరి, గాండ్లపెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై రేపు అవగాహన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై స్థానిక చౌడేశ్వరి కళ్యాణ మండపంలో శిక్షణ అవగాహన సదస్సు ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్గానిక్ సెల్ కన్వీనర్ చింత శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సల్ లైవ్ స్కూల్ వ్యవస్థాపకుడు విశ్వం మాస్టర్, ఎర్త్ 360 వ్యవస్థాపకుడు దినేష్, వాసన్, రాయలసీమ ప్రోగ్రాం ఆఫీసర్ ఉత్తప్ప, నిర్వాహకులు ఇందకూరు సురేందర్ రెడ్డి, హరీష్‌కుమార్, పి. సురేంద్ర, రామక్రిష్ణ, శ్రీనివాసులు, రాము, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

ధర్మవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య నగర్ లో సంజీవరెడ్డికి చెందిన స్కూటీకి మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ప్రతి రోజులాగానే స్కూటీని తన ఇంటిముందు ఉంచాడు. బుధవారం తెల్లవారుజామున లేచి చూసే సరికి స్కూటి దగ్ధమైన విషయాన్ని గుర్తించాడు. దీనిపై టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముగ్గురికి గాయాలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నానప్పగారిపల్లి ఆర్‌సీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ముగ్గురు గాయపడ్డారు. అమడగూరు మండలం గుండువారిపల్లి గ్రామానికి చెందిన ఉమేష్, చీకిరేవులపల్లికి చెందిన రుబేష్, అమడగూరుకు చెందిన రవితేజ ద్విచక్రవాహనంలో కదిరి నుంచి గుండివారిపల్లి గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో ఆ వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో ఆ ముగ్గురూ గాయపడ్డారు. వారికి ఓడీసీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు నిర్వహించి... 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


ముగిసిన రాష్ట్ర మహాసభలు

ధర్మవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓహోంలో మంగళవారం ప్రారంభమైన పీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పీఎస్‌యూ జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీవుల్లా మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. తొమ్మిది నెలలు అవుతున్నా.. నేటికి తల్లికి వందనం, స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మంజుల నరేంద్ర, సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా సురేశ్, చంద్ర, సహాయ కార్యదర్శులుగా నరసింహ, అయ్యన్న, సభ్యులుగా నందకిశోర్, గోపీ, రాంచరణ్, ప్రసాద్, మురళి, కేశవ, అఖిదానంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మురుగుతున్న సమస్యలు

- దశాబ్దాలుగా ఇంతే..!
- అపరిశుభ్రంగా నల్లమాడ
- వీధుల్లో పారుతున్న మురుగు
- ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటున్న వైనం
- దోమలతో జ్వరాల బారిన ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నల్లమాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో మురుగునీటి సమస్యలు తిష్టవేశాయి. వీధుల్లోనే మురుగు, వృథా నీరు పారుతోంది. ఉన్న కొన్ని మురుగు కాలువలు చెత్తతో నిండిపోయాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో ఆ నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర దుర్వాసనతోనే జీవనం సాగిస్తున్నారు. దోమల బారిన పడి.. ఆస్పతి పాలవుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలా 30 సంవత్సరాలుగా ఈ ప్రజలు మురుగుతో ఇబ్బందులు పడుతున్నా.. పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ఎస్సీకాలనీ, మసీదు వీధి, కుమ్మరవీధి, బురుజువీధి, హైస్కూల్ వీధి తదితర ప్రాంతాల్లో మురుగునీరు వీధుల్లోనే పారుతోంది. నల్లమాడ బస్టాండ్ సమీపంలో బ్రిడ్జి వద్ద మురుగు కాలువ చెత్తతో నిండిపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి.. తీవ్ర దుర్వాసన వస్తోంది. మసీదువీధి, బురుజువీధి, కుమ్మరవీధుల ద్వారా ఎస్సీకాలనీలోకి మురుగునీరు నిత్యం ప్రవహిస్తూనే ఉంటుంది. రోడ్లు పాచిపట్టడంతో ద్విచక్రవాహనాలు, పాదాచారులు జారిపడి.. కాళ్లూ చేతులు విరిగిన ఆస్పత్రుల పాలైన సంఘటనలు అనేకం. పత్రికల్లో వార్తలు వచ్చిన సమయంలో మాత్రం అధికారులు తూతూ మంత్రంగా పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించి.. చేతులు దులిపేసుకుంటున్నారు. కరమాల సచివాలయం సమీపంలోనే మురుగునీటి నిల్వ ఓ పెద్ద కుంటను తలపిస్తోంది. ప్రజలు వృథా నీటిని వీధుల్లోకి వేయకుండా.. కొళాయిలు నుంచి నీరు వృథా కా కుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటే.. ఈ సమస్య 80 శాతం పరిష్కరించినట్లె. అయితే ఆ దిశగా అటు పాలకులు గాని.. ఇటు అధికారులు కాని చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దశాబ్దాలుగా కొందరు చేస్తున్న తప్పులకు ప్రజలంతా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


మసీదు వీధి కాలువలో పేరుకున్న చెత్తాచెదారం



రోగాలు వస్తున్నాయ్

మా ఇంటి వెనుకవైపు మురుగునీటి కాలువ ఉంది. కొత్త మసీదు నుంచి ప్రధాన రహదారి బ్రిడ్జి కింద బాలాజీ పాఠశాల వరకు మురుగునీటి ఈ కాలువ ఉంది. ఈ కాలువలో మురుగు ముందుకు సాగకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలు విపరీతంగా పెరిగాయి. ఈ కాలువ పక్కన ఉన్న ఇళ్ల వారు రోగాల బారిన పడి.. ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

-ప్రకాష్, బీసీ కాలనీ, నల్లమాడ



ప్రభుత్వాలు మారినా..

ఎస్సీ కాలనీలో మురుగునీరు వీధుల్లోనే నిత్యం పారుతూ ఉంటుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. అధికారులు మారినా.. ఈ పరిస్థితి మాత్రం మారలేదు. రోడ్లపై మురుగునీరు పారి.. పారి పాచిపట్టింది. అనేక మంది జారి పడ్డారు. కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కాలనీని పరిశీలించారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారే తప్పా.. చేసింది ఏమీ లేదు. కూటమి పాలకులైనా చొరవ చూపాలి.

-నరసింహులు, ఎస్సీకాలనీ, నల్లమాడ


బీసీ కాలనీ వెనుక వైపున్న నిల్వ ఉన్న మురుగునీరు

న్యూస్ బాక్స్

హాస్టల్ మరమ్మతుల పరిశీలన

గోరంట్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని మంత్రి టీడీపీ నాయకులను ఆదేశించడంతో వారు గోరంట్లలోని ఎస్సీ బీసీ హాస్టళ్లను బుధవారం పరిశీలించారు. కూటమి నాయకులు పనులను పరిశీలించి పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కాగా గోరంట్ల మండలంలోని బీసీ ఎస్సీ హాస్టళ్లు, ఖాజాపురం కేజీబీవీ పాఠశాలలో రూ.2.14 కోట్లతో పనులు జరుగుతున్నాయి. బూదిలి ఉన్నత పాఠశాల, గౌనువారి పల్లి పాఠశాల మరమ్మతులకు నిధులు కేటాయించారు. గోరంట్ల బీసీ హాస్టల్‌కు రూ.24.90 లక్షలు, ఎస్సీ హాస్టల్‌కు రూ.20.89 లక్షలు, కేజీబీవీకి రూ.1.51 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మల శ్రీధర్,బాలకృష్ణ,వెంకట్‌రెడ్డి గిరిధర్ గౌడ్, అంజంతుల్లా, నరేష్ పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

అమరాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హేమావతి గ్రామ పంచాయతీలో శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి వీధిలోనూ పరిసరాలను కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. లోఓల్టేజీ కారణంగా కాలిపోయిన వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. పారిశుధ్య పనులు చేసేందుకు మేజర్ పంచాయతీల నుండి స్వీపర్లు, పారిశుధ్య కార్మికులను పిలిపించి హేమావతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనుల చేయించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, మండల విస్తరణ అధికారి నాగముని, పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్ పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్ కోసం ప్రత్యేక పూజలు



సునీతా విలియమ్స్ చిత్రపటంతో సరస్వతీ వెంకటేష్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రోదసిలో స్థితిగతులు తెలుసుకునేందుకు సాహసంతో వెళ్లిన భారతీయ వనిత సునీత విలియమ్స్ క్షేమంగా తిరిగి రావాలని మహా శివరాత్రి రోజు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పాండురంగ నగర్‌లోని ఓం క్రియేషన్స్ నిర్వాహకురాలు సరస్వతీ వేంకటేష్ బుధవారం తన స్వగృహంలో సునీత చిత్రాన్ని చిత్రీకరించి రోదసి నుంచి క్షేమంగా తిరిగి రావాలని మహాదేవునికి పూజలు చేశారు. అనుకోని పరిస్థితుల కారణంగా ఆమె 8 నెలలుగా అంతరిక్షంలోనే ఉండిపోయారు. ఆమెను మార్చి 18న రోదసి నుంచి భూమి మీదకు తీసుకొస్తున్నారని చెబుతున్నారు. కానీ రాగానే ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాల్సి ఉంటుందని చెబుతున్నారు. కాబట్టి భారతీయ మహిళగా ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో భూమికి చేరాలని ఆ దేవదేవున్ని మనసారా కోరుతున్నానని, శివరాత్రి రోజు ఆమె కోసం ప్రత్యేక పూజలు చేశానన్నారు.

150 సీసీ కెమెరాలు పోలీసులకు అప్పగింత



సీసీ కెమెరాలను అందజేస్తున్న గ్రీన్‌కో కంపెనీ ప్రతినిధులు

హిందూపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలక్రిష్ణ చొరవ తీసుకుని గ్రీన్ కో కంపెనీ ద్వారా హిందూపురానికి సోలార్‌తో పనిచేసే 150సీసీ కెమెరాలు పోలీసులకు అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నా, నేరస్తులను గుర్తించాలన్నా సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన గ్రీన్ కో కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రూ.25లక్షలు విలువచేసే 150 సోలార్‌తో పనిచేసే వైర్లెస్ సీసీ కెమెరాలు ఇచ్చారన్నారు. పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో హిందూపురం మండలంలోని పలుచోట్ల వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు కూడా సహకరించి షాపులవద్ద ఇళ్లవద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మునిసిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ మహాశివరాత్రిరోజున మూడవ నేత్రంగా భావించే సీసీకెమెరాలు హిందూపురానికి ఇవ్వడం సంతోషమన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఎమ్మెల్యే పీఏ బాలాజీ, గ్రీన్‌కో కంపెనీ ప్రతినిధులు శివ, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని పరిశీలించిన ఎంపీ



కల్యాణమండపం పనులను పరిశీలిస్తున్న బీకే

సోమందేపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అక్కమ్మగార్ల కొండవద్ద నిర్మిస్తున్న భగీరథ కళ్యాణమండపం నిర్మాణ పనులను బుధవారం హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్యాణమండపం నిర్మాణానికి రూ.80లక్షలు మంజూరు చేశామన్నారు. భవిష్యత్తులో నిధులు అవసరమైతే అందజేస్తామన్నారు. అనంతరం ఉప్పర సగర సంఘం రాష్ట్ర డైరెక్టర్ బోర్వెల్ గోపాల్‌ను నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

వంటగదిని ప్రారంభించిన బీకే

పరిగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీరలింగేశ్వరస్వామి ఆలయకళ్యాణమండపంలో నూతనంగా నిర్మించిన వంట గదిని బుధవారం ఎంపీ బీకే పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు ఉపయోగపడేవిధంగా పథకాలను తీసుకొచ్చి తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరప్ప, కుమార్, శ్రీనివాసరెడ్డి, శేఖర్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తత్ప్రణమామి సదాశివలింగం

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో మడకశిర చంద్ర మౌళేశ్వర స్వామి



భోగసముద్రం చెరువు వద్ద ధ్యానముద్రలో శివయ్య



హిందూపురం : బంగారు కవచంతో శ్రీకంఠేశ్వరస్వామి



సర్వాంగసుందరంగా ఉమానర్మదేశ్వర స్వామి



రాళ్ల కొండల్లోని శివాలయంలో మహాశివుడు



ఆర్ఎస్ఎస్ సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూపురం పట్టణ పరిధిలోని అన్ని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచి మూల విరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలవద్ద దీపాలు వెలిగించి మహాదేవుడిని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. బసవనపల్లిలోని 40 అడుగుల భారీ శివవిగ్రహాన్ని దర్శించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం డివిజన్‌లోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. చిలమత్తూరు మండలంలోని కోడూరు శివాలయం, కొడికొండ పంచనందీశ్వరాలయం, బ్రహేశ్వరంపల్లిలోని పురాతన శివాలయం, చిలమత్తూరు రామలింగేశ్వరాలయాల్లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడకశిర పట్టణంలో వెలిసిన చంద్రమౌళేశ్వరస్వామి, మడకశిర కొండపై వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుకొండ పట్టణంలోని ప్రసిద్ధిచెందిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అవిముక్తేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుడిబండ, అగళి, సోమందేపల్లి, పావగడ తదితర చోట్ల కూడా శివాలయాల్లో భారీగా అర్చనలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

ప్రతి రూపాయి పేదల సంక్షేమం కోసమే..

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి రూపాయి పేదల సంక్షేమానికి ఖర్చుపెడుతోందని టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. గత వైసీపీ పాలనలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కేవలం వైసీపీ నాయకులు మాత్రమే దొంగదారిలో తీసుకొనేవారని, ప్రజా ధనాన్ని రాబందుల్లా దోచేశారన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదవారిని ఆదుకొనే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెనక్కు తగ్గడం లేదని, ప్రతిక్షణం సంక్షేమం కోసమే ఆలోచిస్తున్నారని అన్నారు. పేదవారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న స్పందన చూసి వైసీపీ అధినేత జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5.20లక్షల చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్య నిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, తదితరులు ఉన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



హేమావతి శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో మహాశివరాత్రి పండుగ పురస్కరించుకొని ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలను ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపణ్ణస్వామి దేవాలయాలను సందర్శించారు. ప్రధాన అర్చకులు వారికి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్లు గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మడకశిర మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, మద్దనకుంటప్ప, మాజీ సర్పంచి కుమారస్వామి తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

కంది విక్రయాలకు రైతుల జాగరణ

● మార్క్‌ఫెడ్ ఏజన్సీ సిబ్బంది నిర్లక్ష్యం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మార్క్‌ఫెడ్ ఏజెన్సీ సిబ్బంది నిర్లక్ష్యంతో సకాలంలో కందుల విక్రయాలు జరపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఒక్క రొద్దం మండలంలోనే 6098మంది రైతులు 15వేల ఎకరాలకుపైగా కందిపంట సాగుచేశారు. మార్కెట్‌లో క్వింటాల్ కంది ధర రూ.6వేలు ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం కంది రైతులకు రూ.7750 మద్దతు ధర ప్రకటించింది. రొద్దం మండలంలో కందిపంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో ఈనెల 2నుంచి రొద్దం మరువపల్లిలోని రైస్‌మిల్లులో, తురకలాపట్నంలోని ఆర్బీకే కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కొనుగోలు చేసిన కందులను మార్క్‌ఫెడ్ ఏజెన్సీ గిడ్డంగులకు తరలించి రైతుల ఖాతాలో నగదు జమచేస్తారు. మార్క్‌ఫెడ్ ఏజెన్సీ సిబ్బంది నిర్లక్ష్యంతో గత రెండు రోజుల నుంచి కందుల రవాణా నిలిచిపోవడంతో రైతన్నలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గోదాములకు లారీలు రాకపోవడంతో రైతులు తెచ్చిన కందులు గోదాములో నిలువ ఉండిపోవడంతో రాత్రింబగళ్లు రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది. కాని ఇప్పటి వరకు 1300టన్నులు తరలించామని, మిగతావి కూడా తరలిస్తామని మార్క్‌ఫెడ్ ఏజెన్సీ నిర్వాహకులు తెలుపడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



రొద్దం గోదాము నుంచి కందులను తరలిస్తున్న దృశ్యం

రైతులకు ఎప్పటికప్పుడు బిల్లింగ్ చేస్తున్నాం: గీత, మార్క్‌ఫెడ్ డీఎం

అనంతపురంలో గోదాములు నిండిపోవడంతో కందుల తరలింపు ఆలస్యమైంది. మొదటగా కనేకల్లు గోదాముకు తరలించాలని అనుకున్నాం. అయితే కేంద్ర మార్క్‌ఫెడ్ సంస్థవారు ఒప్పుకోకపోవడంతో గోదాముల నుంచి కందుల తరలింపు ఆగిపోయింది. ప్రస్తుతం ప్రొద్దుటూరు గోదాములో నిలువ చేయడానికి అనుమతులు రావడంతో రెండ్రోజుల నుంచి రొద్దం మండలంలోని గోదాము నుంచి 1300టన్నులు తరలించాం. గోదాముకు వచ్చిన రైతులకు ఎప్పటికప్పుడు బిల్లింగ్‌చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.



లారీలు లేక ఆరుబయట నిల్వ ఉంచిన కందులు

రవాణా సౌకర్యం కల్పించండి



రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలో రైతులు పండించిన కందులు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారని వాటిని గోడౌన్లకు తరలించడానికి రవాణా సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు హరి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటన చేస్తూ రొద్దం మండలంలో అత్యధికంగా రైతులు కందులను సాగుచేశారన్నారు. ఇప్పటికీ ఇంకా 8వేల క్వింటాళ్లు తరలించాల్సి ఉందని రైతుల నుంచి సేకరించిన కందులు చేరవేసినా 15రోజుల తరువాత రైతులు బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. రవాణా సౌకర్యం సక్రమంగా లేక కందులను గిడ్డంగులకు తరలించకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలవద్ద శివరాత్రికి ముందే జాగరణ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రవాణా సౌకర్యం ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి



తరుణ్ మృతదేహం

గోరంట్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉగ్రారంపల్లికి చెందిన మూడున్నర సంవత్సరాల వయసు కలిగిన బాలుడు తరుణ్ ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి బుధవారం మరణించారు. బాలకృష్ణకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ నీటితొట్టెలో పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.వెంటనే అతన్ని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా పరీక్షించి అప్పటికే బాలుడు మరణించినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల మండలంలోని కసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వివాహిత క్రిమిసంహారక మందుతాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్ కుమార్ చికిత్స జరిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

కారును ఢీకొని ఆటో బోల్తా

గోరంట్ల మండలంలోని పుట్టపర్తి ప్రధాన రహదారిలో బూచేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఓ కారు ఆటోను ఢీకొన్న సంఘటనలో బుధవారం ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గోరంట్ల నుంచి ఆటోలో క్యాటరింగ్ ఫుడ్ డెలివరీ ఇచ్చి తిరిగి వస్తుండగా పుట్టపర్తి వైపు వెళ్తున్న కారు ఆ ఆటోను ఢీకొంది, ప్రమాదంలో ఆటో డ్రైవర్ తేజ గోరంట్లకు చెందిన బలరాం సింగ్, మల్లికార్జున, కరావులపల్లి తాండాకు చెందిన తిప్పానాయక్, రామస్వామి నాయక్, అంజునాయక్ గాయపడ్డారు. వారిని గోరంట్ల ఆసుపత్రికి తలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు జరిపారు. బలరాంసింగ్, తిప్పానాయక్‌లను మెరుగైన వైద్యసేవలకు హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

మామిడి తోటకు నిప్పు

మడకశిర రూరల్ ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్యాంపురం గ్రామ సమీపంలో రైతు నారాయణప్ప మామిడి తోటకు మంగళవారం అర్థ రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే వారు వచ్చి మంటలను అదుపుచేశారు, అగ్నిప్రమాదంలో తీవ్రంగా పంట నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపారు. కల్లుమర్రి గ్రామానికి చెందిన మరో రైతు నారాయణప్ప దానిమ్మ తోటకు బుధవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. వెంటనే స్థానిక రైతులు అందరూ కలసి మంటలను అదుపుచేశారు. దానిమ్మతోట కొంత వరకు దెబ్బతిన్నట్లు రైతు నారాయణప్ప తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆకతాయిలపై గట్టి నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

లేపాక్షి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామానికి చెందిన వెంకటేశ్(26) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కంచిసముద్రం గ్రామానికి చెందిన అశ్వర్థప్ప కుమారుడు వెంకటేశ్(26) తాగుడుకు బానిసై ఎప్పుడూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంటిలో పైకప్పుకు చీరతో ఉరివేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

టీడీపీ యువ కార్యకర్త మృతి



అనిల్‌కుమార్ (ఫైల్)

అగళి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యువ కార్యకర్త అనీల్‌కుమార్ యాదవ్(33) మృతిచెందారు. అగళి మండలం హెచ్‌డిహళ్లి గ్రామానికి చెందిన అనీల్‌కుమార్ ఉదయం ఇంటిలో స్నానం చేయడానికి వెళ్లి వేడినీళ్లను తలపై పోసుకుంటుండగా ఉన్నపళంగా అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడు టీడీపీలో యువ కార్యకర్తగా పనిచేస్తుండేవాడు. ఇతనికి భార్య రాధ, కుమారుడు ఉన్నారు. అనిల్ హఠాన్మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. జడ్పీటీసీ ఉమేష్, నాయకులు రాజన్న, రామక్రిష్ణ, తదితరులు వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. టీడీపీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.